క్లుప్తంగా

ఘనంగా వార్షిక బ్రహ్మోత్సవాలు



పల్లకీ సేవలో భక్తులు

విజయనగరం రూరల్: మండలంలోని దుప్పాడ గంగానగర్‌లో ఉన్న భారతీయ తత్త్వదర్శన కేంద్రం శ్రీక్షేత్రమ్‌లో వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. దేవాలయంలో కొలువై ఉన్న అష్టలక్ష్మీ సమేత ఐశ్వర్య వేంకటేశ్వర స్వామికి ఉదయం సుప్రభాత సేవ, గరుడ హోమం, అనంతరం పల్లకీసేవ చేపట్టారు. కార్యక్రమంలో దేవాలయం ధర్మకర్తలు దుర్గాబాలాజీ, ఉమాదేవి దంపతులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కొప్పెర్ల పార్వతమ్మ జాతర



జాతరలో భక్తుల సందడి

పూసపాటిరేగ: మండలంలోని కొప్పెర్ల పార్వతమ్మ జాతర మూడోరోజైన శుక్రవారంతో ముగిసింది. ఉదయం ఆరు గంటల నుంచే భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. జాతరను ద్విగ్విజయం చేసిన ప్రతి ఒక్కరికీ కమిటీ తరఫున ఇనకోటి వంశీయులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



ఆలయ కమిటీ సభ్యులకు చెక్కు అందిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు సన్యాసినాయుడు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని ఆల్తిపాలెం రామాలయ నిర్మాణానికి జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు రూ.20 వేల విరాళం ప్రకటించారు. ఈ మేరకు కొండవెలగాడలో ఆలయ కమిటీ ప్రతినిధులకు శుక్రవారం చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా సన్యాసినాయుడు మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలకు తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పప్పల భాస్కరరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విద్యాశాఖ డైరెక్టర్‌గా లక్ష్మి కొనసాగింపు



బమ్మిడి లక్ష్మి

డెంకాడ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్య, సంక్షేమ, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ డైరెక్టర్‌గా నాతవలస మాజీ సర్పంచ్ బమ్మిడి లక్ష్మిని కొనసాగిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈమె పదవీకాలం ముగియడంతో పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడులకు కృతజ్ఞతలు తెలియజేసింది.

ఈవీఎం, వీవీప్యాట్‌లపై అవగాహన



వీవీప్యాట్‌పై అవగాహన కల్పిస్తున్న ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణమూర్తి

భోగాపురం: మండలంలోని సవరవల్లి, ముంజేరు, కవులవాడ, తూడెం గ్రామాల్లోని ఓటర్లకు ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ ఏవీవీ సత్యనారాయణమూర్తి ఈవీఎం, వీవీప్యాట్‌లపై శుక్రవారం అవగాహన కల్పించారు. కొత్తగా ఓటర్లుగా నమోదైన వారు ఓటు ఎలా వినియోగించుకోవాలో వివరించారు. అదేవిధంగా ఓటు వేసే సమయంలో ఎటువంటి గుర్తింపు కార్డులు తీసుకురావాలో తెలియజేశారు.

ప్రజలందరిపై ఖాదర్‌బాబా ఆశీస్సులు



దర్గాలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎంపీ డాక్టర్ బొత్స ఝాన్సీలక్ష్మి

విజయనగరం టౌన్: హజరత్ ఖాదర్ వలీబాబా ఆశీస్సులు జిల్లా ప్రజలందరిపైనా ఉండాలని పార్లమెంట్ మాజీ సభ్యురాలు డాక్టర్ బొత్స ఝాన్సీలక్ష్మి ఆకాంక్షించారు. బాబామెట్టలో హజరత్ ఖాదర్‌వలీబాబా ఉరుసు మహోత్సవాల్లో శుక్రవారం ఆమె పాల్గొని బాబా చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. దర్బార్ దర్గా నిర్వాహకుడు డాక్టర్ ఖలీల్‌బాబు ఆమెకు సాదర స్వాగతం పలికి, బాబా విశిష్టతను వివరించి, చాదర్ సమర్పించారు. కార్యక్రమంలో ఝాన్సీలక్ష్మి కుటుంబ సభ్యులు, అభిమానులు పాల్గొన్నారు.

దశాబ్దాల కల.. తీరనున్న వేళ..

- నెల్లిమర్లలో శరవేగంగా 'స్వర్గధామం' నిర్మాణం
- చిక్కాల ఆధ్వర్యంలో చురుగ్గా అభివృద్ధి పనులు



చంపావతి తీరంలో స్వర్గధామం కోసం చదును చేసిన స్థలం

నెల్లిమర్ల: పట్టణ వాసుల దశాబ్దాల కల నెరవేరనుంది.. త్వరలోనే వారి కష్టాలు గట్టెక్కనున్నాయి.. ఈ మేరకు చిక్కాల ఆధ్వర్యంలో పట్టణంలో స్వర్గధామం నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. సుమారు రెండెకరాల విస్తీర్ణంలో ఈ పనులు చేపడుతున్నారు. అభివృద్ధి పనులకు పలువురు దాతలు ఇప్పటికే ముందుకొచ్చారు. పనులన్నీ పూర్తయితే నెల్లిమర్ల పట్టణానికి సంబంధించి 'అంతిమ యాత్ర' కష్టాలు గట్టెక్కినట్లేనని ప్రజలు చెబుతున్నారు. వివరాల్లోకి వెళితే..

ఆది నుంచీ అవే ఇక్కట్లు..

2013వ సంవత్సరంలో నెల్లిమర్ల నగర పంచాయతీ ఆవిర్భవించింది. అంతకుముందు ఇది మేజర్ పంచాయతీగా ఉండేది. పట్టణ పరిధిలో సువిశాలమైన చంపావతి నదీ తీరముంది. ఈ తీరంలోనే పట్టణవాసుల అంతిమ కర్మలు జరిపించడం ఆనవాయితీగా వస్తోంది. మొదట్నుంచీ ఇక్కడ ఎటువంటి సౌకర్యాలు అందుబాటులో లేవు. కొన్ని వీధులకు చెందిన ప్రజలు మృతి చెందితే వారి పార్థివ దేహాలను మోసుకొని, రైల్వే పట్టాలు దాటి నదీ తీరం చేరుకోవాల్సిన పరిస్థితి ఉండేది. వర్షాకాలంలో అయితే దహన సంస్కారాలకు చాలా ఇబ్బందులు పడేవారు. అయితే నగర పంచాయతీగా ఆవిర్భవించిన తర్వాత శ్మశానాల అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేసినప్పటికీ అవి కార్యరూపం దాల్చలేదు.

ఎట్టకేలకు మోక్షం..

ఈ నేపథ్యంలో నెల్లిమర్ల పట్టణానికి సంబంధించి స్వర్గధామం నిర్మాణానికి తాజాగా బీజం పడింది. వైఎస్సార్‌సీపీ పట్టణ విభాగం అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు ఆ దిశగా అడుగులు వేశారు. ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడి ప్రోత్సాహంతో స్వర్గధామం నిర్మాణ పనులు చకచకా చేపడుతున్నారు. నెల్లిమర్ల జూట్ మిల్లుకు సమీపంలో ప్రధాన రహదారిని ఆనుకుని స్వర్గధామం ఏర్పాటు జరుగుతోంది.

ఎమ్మెల్యే బడ్డుకొండ చొరవతో...



నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు చొరవతో స్వర్గధామం నిర్మాణానికి అవకాశం కలిగింది. నగర పంచాయతీ కౌన్సిల్ ద్వారా తీర్మానం చేసి, చంపావతి నది ఒడ్డున రెండెకరాల ప్రభుత్వ స్థలం కేటాయించారు. ఎమ్మెల్యే సహకారంతో స్థలాన్ని ఇప్పటికే చదును చేయించాం. అవసరమైన బోర్లు ఏర్పాటు చేసి, దహన వాటికలు నిర్మిస్తాం. అలాగే చుట్టూ ప్రహరీ నిర్మించి, తగిన సౌకర్యాలు కల్పించడానికి ఏర్పాట్లు చేస్తున్నాం. అంతేగాకుండా దాతల సహకారంతో అంతిమయాత్ర కోసం అవసరమైన వాహనాన్ని కూడా అందుబాటులోకి తీసుకువస్తాం.

– చిక్కాల సాంబశివరావు, వైఎస్సార్‌సీపీ నగర పంచాయతీ అధ్యక్షుడు

గ్రామాల్లోనే అన్ని రకాల వైద్యసేవలు

- వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి



వైద్యులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి

భోగాపురం: పేద ప్రజలు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గ్రామంలోనే అన్ని రకాల వైద్య సేవలందించేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని రావివలస గ్రామ సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష–2 వైద్యశిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఉప్పాడ మాట్లాడుతూ.. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలతో గ్రామస్వరాజ్యాన్ని సాధించిన ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని చెప్పారు. వైఎస్సార్‌సీపీ పాలనలో విద్య, వైద్య రంగాలకు ఎనలేని ప్రాధాన్యం ఇచ్చారని తెలిపారు. సంక్షేమ పాలన కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో జగన్ మోహన్ రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. వైద్యశిబిరంలో సుమారు 360 మంది వైద్యసేవలు పొందారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి. చంద్రకళ, వైద్యులు వి. లత, ఎం.చాణక్య, వి. శ్రీనివాస్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

రైతులపై కాల్పులు అన్యాయం



నిరసన తెలియజేస్తున్న సీఐటీయూ నాయకులు

విజయనగరం ఫూల్‌బాగ్: సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఢిల్లీ సరిహద్దు కేంద్రంగా ఆందోళన చేపడుతున్న రైతులపై కేంద్ర ప్రభుత్వం పోలీసులచే కాల్పులకు పాల్పడడం అన్యాయమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎ. జగన్ మోహనరావు అన్నారు. ఈ మేరకు కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపులో భాగంగా స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. పోలీసుల కాల్పుల్లో యువరైతు శుభకరణ్‌సింగ్ మృతి చెందడం బాధాకరమని, బాధిత రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బుచ్చయ్య, సింహాచలం, వెంకటేష్, రాంబాబు, రవి, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ



కొప్పెర్లలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ ప్రవల్లికప్రియ

పూసపాటిరేగ: మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ ప్రవల్లిక ప్రియ శుక్రవారం పరిశీలించారు. కుమిలి, రెల్లివలస, చల్లవానితోట, పూసపాటిరేగ, కొప్పెర్ల గ్రామాలలో పోలింగ్ కేంద్రాలను సందర్శించి, మౌలిక వసతులపై ఆరా తీశారు. రెల్లివలస తుఫాన్ షెల్టర్‌లో నిర్వహిస్తున్న 81 నంబర్ పోలింగ్ కేంద్రం శిథిలావస్థకు చేరుకోవడంతో పక్కనే ఉన్న కల్యాణ మంటపంలోకి మార్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తామన్నారు. చింతపల్లిలో ఉన్న పోలింగ్ కేంద్రాన్ని మార్పు చేయాలని రాజకీయ పార్టీల నాయకులు కోరడంతో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. ఆమెతో పాటు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మాధురి, వీఆర్‌ఓలు శ్రీనివాసరావు, కనకదుర్గ, తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'ను సద్వినియోగం చేసుకోండి

- ఎంపీపీ మామిడి అప్పలనాయుడు



మందులను పరిశీలిస్తున్న ఎంపీపీ అప్పలనాయుడు

విజయనగరం రూరల్: ప్రజలకు గ్రామాల్లోనే అన్ని రకాల వైద్య సేవలు అందించేందుకు గాను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని విజయనగరం ఎంపీపీ మామిడి అప్పలనాయుడు తెలిపారు. మండలంలోని రాకోడులో 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముగ్గురు స్పెషలిస్టు వైద్యుల పర్యవేక్షణలో సిబ్బంది సుమారు 200 మందికి వైద్యసేవలు అందించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎంపీపీ అప్పలనాయుడు వైద్య సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో సర్పంచ్ పాటిపిరెడ్డి వెంకటరమణ, రాకోడు పీహెచ్‌సీ వైద్యాధికారులు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నిధులు సక్రమంగా వినియోగించుకోవాలి

- డీఆర్‌డీఏ ఏపీడీ సావిత్రి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీడీ సావిత్రి

గంట్యాడ: స్వయం సహాయక సంఘాలు, గ్రామ సంఘాలు, మండల మహిళా సమైఖ్యలు ఆర్థికంగా సుస్థిరత సాధించేందుకు నిధులను సక్రమంగా వినియోగించుకోవాలని డీఆర్‌డీఏ ఏపీడీ పి.సావిత్రి సూచించారు. స్థానిక కొఠారుబిల్లి జంక్షన్‌లో ఉన్న వెలుగు కార్యాలయంలో శుక్రవారం మహిళా సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈనెల 29, మార్చి 1, 2 తేదీల్లో కేంద్ర బృందం మండల సమైఖ్యను పరిశీలించేందుకు వస్తోందన్నారు. సమైఖ్య సభ్యులు ఆర్థిక అంశాలతో పాటు సామాజిక అంశాలపై కూడా సమావేశాల్లో చర్చించాలన్నారు. సమావేశంలో ఎంఎంఎస్ అధ్యక్షురాలు జననీ, స్త్రీనిధి అసిస్టెంట్ మేనేజర్ అల్లు ఉమామహేశ్వరావు, డీపీఎంలు జయశ్రీ, రాజ్‌కుమార్, బంగారమ్మ, ఏపీఎంలు శ్రీనివాస్, విజయ్‌కుమార్, శైలేష్, సీసీలు రామకృష్ణ, చినబాబు, ముత్యాలనాయుడు, గౌరీశ్వరి, అచ్చింనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధే ధ్యేయం



నిర్మిస్తున్న సీసీ రోడ్డు

భోగాపురం: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని వైఎస్సార్‌సీపీ నాయకుడు కిలారి వెంకటరమణ అన్నారు. మండలంలోని రాజాపులోవ గ్రామంలో రూ.14 లక్షల ఎంపీపీ నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వాల కంటే భిన్నంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయంలో సంక్షేమం, అభివృద్ధి పెద్ద ఎత్తున జరుగుతోందని చెప్పారు.

నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు

విజయనగరం టౌన్: కేంద్ర ప్రభుత్వ సర్వే ప్రాగ్రాంలో పనిచేయడానికి అర్హత కలిగిన అభ్యర్థులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు శ్రీవత్స ఇంటిగ్రేటెడ్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ కోరాడ రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాస్/ఫెయిల్ అయిన అభ్యర్థులు (ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్ కలిగి ఉండాలి) అర్హులని, ప్రారంభ జీతం రూ. 15 వేలు ఉంటుందని పేర్కొన్నారు. అదే విధంగా డిగ్రీ అర్హత ఉన్న పురుష అభ్యర్థులకు టీమ్ లీడ్‌గా అవకాశం కల్పిస్తామని, వారికి రూ. 18 వేల జీతం ఉంటుందన్నారు. డిగ్రీ/బీటెక్ చేసి కంప్యూటర్ నాలెడ్జ్ కలిగిన మహిళలకు ఆఫీస్ అసిస్టెంట్ పోస్టులున్నాయని, వేతనం 15 వేలు ఉంటుందని తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు తోటపాలెం డిమ్స్ కంప్యూటర్స్ సంస్థలో గాని, 91544 66677 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలి

విజయనగరం క్రైమ్: నగరంలో ఇటీవల కాలంలో మోటార్‌సైకిళ్ల దొంగతనాలు జోరుగా జరుగుతున్న నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు సూచించారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న పోలీస్ సిబ్బంది, మహిళా పోలీసుల సహకారంతో ప్రతి ఇంటిని సందర్శించి, బైక్ దొంగతనాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేకంగా రూపొందించిన కరపత్రాలను శుక్రవారం అందజేశారు. బైక్‌లకు తాళాలు వేయకపోవడం.. రోడ్డుపై ఎక్కడ పడితే అక్కడ పార్కింగ్ చేయడం.. ఇంటి బయటే బైక్‌లను ఉంచడం వల్ల దొంగతనాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉందని సీఐ తెలిపారు. వీలైనంతవరకు బైక్‌లకు వీల్స్ లాక్, పెట్రోల్ లాక్ వేసుకోవాలని సూచించారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

భోగాపురం: మండలంలోని పోలిపల్లి జంక్షన్ వద్ద శుక్రవారం సాయంత్రం వాహన తనిఖీలు చేపడుతున్న సమయంలో పోలిపల్లి గ్రామానికి చెందిన మామిడి బాలకృష్ణ వద్ద 13 మద్యం సీసాలు లభించినట్లు సీఐ రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

రూ.84 లక్షలతో అభివృద్ధి పనులు



మాట్లాడుతున్న ఎంపీపీ చలంనాయుడు

బొండపల్లి: మండల పరిషత్ నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఎంపీపీ చల్లా చలంనాయుడు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో జెడ్పీటీసీ రాపాక సూర్యప్రకాశరావుతో కలిసి శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఎంపీపీగా బాధ్యతలు చేపట్టి సుమారు రెండున్నరేళ్లవుతోందని, ఈ కాలంలో రూ.84 లక్షలతో సీసీరోడ్లు, కాలువలు, ఇతర ప్రాధాన్యత పనులను చేపట్టడం జరిగిందన్నారు. ఈ ఏడాది మరో రూ.42 లక్షలతో వివిధ పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. రూ.55 లక్షలతో మండల పరిషత్ కార్యాలయ సముదాయంలో సీసీరోడ్లు, ఎంపీపీఓ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, వెలుగు, డూమా, అగ్రికల్చర్ కార్యాలయం మరమ్మత్తు పనులు, సభావేదిక నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు.

వ్యాపార అభివృద్ధికి ప్రణాళికలు తయారుచేస్తున్నాం

- డీసీఎంఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ అవనాపు భావన



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ అవనాపు భావన

విజయనగరం ఫోర్ట్: డీసీఎంఎస్ ద్వారా రానున్న రోజుల్లో వ్యాపారాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు అవసరమైన ప్రణాళికలు తయారు చేస్తున్నట్లు డీసీఎంఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ అవనాపు భావన అన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక డీసీఎంఎస్ కార్యాలయంలో చైర్‌పర్సన్ అధ్యక్షతన ఇనిస్టిట్యూట్ ఆఫ్ కో ఆపరేటివ్ మేనేజ్‌మెంట్ (ఐసీఎం) శిక్షణ సంస్థకు చెందిన బిజినెస్ ఎనలిస్ట్ డాక్టర్ శ్యామ్‌కుమార్, బిజినెస్ మేనేజర్ సాయికుమార్ బృంద సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అన్నదాతలకు అండగా నిలిచేందుకు, సేంద్రియ వ్యవసాయన్ని ప్రోత్సహించేందుకు చిరుధాన్యాల మార్కెటింగ్‌కు సంబంధించి ప్రతిపాదనలు తయారు చేశామన్నారు. అలాగే రైతన్న శ్రమకు తగ్గ ఫలితం అందించడంతో పాటు, ప్రజారోగ్యానికి ఉపయోగపడేవిధంగా చోడి ప్రాసెసింగ్ యూనిట్‌ను నెలకొల్పేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. పేద ప్రజలకు తక్కువ ధరకు మందులు అందించేందుకు బొబ్బిలి, విజయనగరం పట్టణాల్లో డీసీఎంఎస్ స్థలాల్లో కమర్షియల్ షాపింగ్ కాంప్లెక్స్‌లు (మందుల దుకాణాలు) ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐసీఎం బృంద సభ్యులు డాక్టర్ రామన్, శ్రీరాములనాయుడు, సన్యాసినాయుడు, బాలి బంగారునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజమే రోటరీ ధ్యేయం



ఉచిత వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

విజయనగరం: ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే రోటరీ ధ్యేయమని విజయనగరం రోటరీ ప్రధాన క్లబ్ అధ్యక్షులు డాక్టర్ కె. కృష్ణకాంతి అన్నారు. రోటరీ సంస్థ ఆవిర్భవించి 119 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పట్టణంలోని కంటోన్మెంట్ రోటరీ టవర్ వద్ద శుక్రవారం పేదలకు ఆహారం పంపిణీ చేశారు. అనంతరం మహారాజ కళాశాలలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ రెండు కార్యక్రమాలను ప్రారంభించిన అధ్యక్షులు డాక్టర్ కృష్ణకాంతి మాట్లాడుతూ.. రోటరీ క్లబ్ ద్వారా పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సుగర్, బీపీ, ఈసీజీ, తదితర పరీక్షలు నిర్వహించి, అవసమైన వారికి మందులు అందజేస్తున్నట్లు తెలిపారు. సమాజంలో అందరూ ఆరోగ్యంగా ఉన్నప్పుడే సామాజిక ప్రగతి సాధ్యం అవుతుందన్నారు. రోటరీ వైద్య శిబిరాల సేవలు ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు నీతూ విజ్వానీ, మాటూరి మురళీకృష్ణ, నారాయణ మూర్తి, మేఘరాజ్ రాఠీ, తదితరులు పాల్గొన్నారు.

రక్త నిల్వల కొరత అధిగమించాలి..



రక్తదానం చేస్తున్న దాతలు

విజయనగరం: వేసవికాలంలో రక్తనిల్వల కొరతను అధిగమించేందుకు రక్తదాన శిబిరాల నిర్వహణకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని విజయనగరం రోటరీ సెంట్రల్ క్లబ్ అధ్యక్షుడు వీవీ రాజేష్ అన్నారు. ప్రపంచ రోటరీ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక ఆర్‌కే డిగ్రీ కళాశాలలో క్లబ్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శిబిరం ద్వారా సేకరించిన 70 యూనిట్ల రక్తాన్ని రోటరీ బ్లడ్ బ్యాంక్, ఎన్‌వీఎన్ బ్లడ్‌బ్యాంక్‌కు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ ఆర్.శంకర్‌రెడ్డి, క్లబ్ పాస్ట్ గవర్నర్ ఎం. రామారావు, బి. అశోక్, ఎం.అశోక్, న్యాయవాది జయకృష్ణ, కేఆర్‌కే రాజు, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

పెంచిన జీతాలు ఇప్పించాలి..



ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డులు

విజయనగరం ఫోర్ట్: ఆస్పత్రుల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు, సెక్యూరిటీ గార్డులు, పెస్ట్ కంట్రోల్ సిబ్బందికి పెంచిన జీతాలు కాంట్రాక్టర్లతో ఇప్పించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రోగులకు ఇబ్బంది కలగకుండా పారిశుధ్య కార్మికులు, పెస్ట్ కంట్రోల్, ఇతర సిబ్బంది పనిచేస్తున్నారని చెప్పారు. అధికారులు స్పందించిన ప్రభుత్వం నిర్ణయించిన మేరకు జీతాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సన్యాసినాయుడు, లక్ష్మి, పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

సమ్మె విజయవంతం



నిరసన కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది, అధికారులు

విజయనగరం అర్బన్: గ్రామీణ వికాస బ్యాంకుల ఉద్యోగ, అధికారుల ఒక రోజు సమ్మె శుక్రవారం విజయవంతమైంది. అఖిల భారత ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల ఉద్యోగుల సంఘం (ఏఐఆర్ఆర్‌బీఈఏ) జాతీయ కమిటీ ఉద్యమ కార్యాచరణలో భాగంగా ఇచ్చిన సమ్మె పిలుపు మేరకు జిల్లాలో సమ్మె చేశారు. స్థానిక ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరసనలో పలువురు మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న పలు న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని నినాదాలు చేశారు. అనంతరం ప్రాంతీయ కార్యాలయం మేనేజర్ డీఆర్‌కే రాజును కలిసి వినతిపత్రం అందజేసారు. కార్యక్రమంలో ఏపీజీవీబీ ఆఫీసర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ గంటా అప్పలనాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఫణికుమార్, మధుసూదనరావు, అంబటి దుర్గ, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పీఎంజేజేవై సాయం అందజేత



చెక్ అందజేస్తున్న బ్యాంక్ రీజనల్ మేనేజర్ సీహెచ్ విజయసుబ్రహ్మణ్యం

విజయనగరం అర్బన్: ప్రధానమంత్రి జీవనజ్యోతి యోజన పథకం (పీఎంజేజేబీవై) కింద స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియ (ఎస్‌బీఐ) ఆర్టీసీ కాంప్లెక్స్ శాఖ తమ ఖాతాదారుడు కండివలస గణపతి భార్య కందివలస కనకలక్ష్మికి శుక్రవారం రూ.2 లక్షల చెక్కును అందజేశారు. స్థానిక బ్యాంక్ కార్యాలయంలో బ్యాంక్ రీజనల్ మేనేజర్ సీహెచ్.విజయసుబ్రహ్మణ్యంమ చెక్కు అందించారు. గణపతి గతేడాది అక్టోబర్ 16న హార్ట్ ఎటాక్‌తో మృతి చెందగా.. పీఎంజేజేవై పథకం కింద ఈ మొత్తాన్ని అందజేసినట్లు బ్యాంక్ మేనేజర్ కె.కోటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో బ్యాంక్ ఫైనాన్సియల్ ఇన్‌కూ మేనేజర్ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.